# బదిలీ

-కె. బి. కృష్ణ

అధికారం చేతిలో ఉంటే ఏ పనైనా చేసుకోవచ్చు అనుకోవడం పొరపాటు.

అది ఒక ప్రభుత్వ కార్యాలయం. ఆ కార్యాలయం కాకినాడలో ఉంది. శాఖలు రాజమండ్రి, విశాఖపట్నం, పలాస, ఇచ్ఛాపురంలో ఉన్నాయి. చాలా మంది సిబ్బంది. అందువల్ల ఆఫీసరుగారు శాఖా కార్యాలయాన్ని తిరుగుతూ - ప్రధాన మంత్రి విదేశీ పర్యటనలు చేస్తూ అప్పుడప్పుడూ దేశంలో ఉన్నట్లుగా - కాకినాడలో నాలుగు రోజులు ఉండి సంతకాలు పెడుతూ ఉంటారు.

ఆ ఆఫీసులో డిజైన్స్ విభాగంలో చిన్న ఉద్యోగి మురళి - ఆఫీసరు గారికి స్వయానా బావ మరిది. దానితో ముఖ్యమంత్రి గారి చిన్నల్లుడు లాగా ఆఫీసులో అందరి మీదా అధికారం చెలాయిస్తూంటాడు. అతనికి కళ్ళెం వెయ్యడం ఎవరివల్లా కావడం లేదు.

సిబ్బంది గుమాస్తా తలవంచుకుని పని చేసుకుంటున్నాడు. అతని దగ్గరకు ఆఫీసరు గారి బావ మరిది వచ్చాడు.

"ఏమయ్యా? ఆయన వచ్చే సమయం అయ్యింది సంతకాలకు అన్నీ తయారు చేశావా? మళ్ళీ రెండు మూడు రోజుల్లో ఢిల్లీ వెళ్తారుట. ఢిల్లీలో నెల రోజులు డిజైన్స్ మీటింగ్స్‌లో పాల్గొని అప్పుడు వస్తారుట. నెల రోజుల దాకా ఆయన ఉండరు కదా అని పని అంతా చేసుకో -"

'వీడి జిమ్మడ! వీడే నాకు మొగుడయ్యాడు' అని లోపల తిట్టుకుంటూ [సి. గు.] సిబ్బంది గుమాస్తా "చేస్తున్నానండి. అంత కంగారుపడితే ఎలాగు? మేమూ మనుషులమేకదండీ?" అన్నాడు.

"తెలుస్తూనే ఉంది. ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చెయ్యి. లేకపోతే ఇచ్ఛాపురం బదిలీ చేయిస్తాను. మా బావగారితో చెప్పి -" అసెంబ్లీలో బంపర్ మెజారిటీ ఉన్న ముఖ్యమంత్రిలా గర్వంగా మాట్లాడసాగాడు మురళి.

"అయ్యా అలాగేనండి" అని లోపల తిట్టుకుంటూ "సి. గు." పని చేసుకోసాగాడు.

ఈ లోగా ఆఫీసరు గారు వస్తున్నట్లుగా జీపు హారన్ శబ్దం వినపడింది. కార్యాలయం అంతా అప్పటి వరకూ చేపల బజారులా ఉన్నది - నిశ్శబ్దంగా అయిపోయింది.

ఆఫీసరు గారి గదిలో ఫైల్స్ గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. శాఖల వారీగా విభజించి ఉంచారు ఫైల్సు. ఎవరి ఫైల్సు చూస్తుంటే వారిని పిలిచి సంతకాలు పెడుతున్నారు. ఆయన సిబ్బంది సమస్యలు ఎక్కువ కాబట్టి సిబ్బందికి సంబంధించిన ఫైల్స్ చివరనపెట్టారు.

రాత్రి తొమ్మిదయింది. ఆఫీసరు గారికి చాలా విసుగ్గా ఉంది. ఆ సమయంలో "సి. గు." గారికి పిలుపునచ్చింది.

లోపలకు వెళ్ళి అన్నీ ఆయనకు వివరంగా చెప్పి - సంతకాలు పెట్టించాడు. "సి. గు." - "సి. గు." అంటే ఆయనకు గురి ఎక్కువ - అందుకని అతను ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ ఒక్కోసారి కాగితాలు చూడకుండా కూడా సంతకం పెట్టిన సందర్భాలు ఉన్నాయి.

ఆ రాత్రి కార్యాలయం నుంచి వెళ్ళిపోతూ - విశాఖపట్నం చిన్న ఆఫీసరు అర్జెంటు పనులు చూస్తారని చెప్పి ఆయన వెళ్ళిపోయారు.

మర్నాడు మధ్యాహ్నం, మురళిని ఇచ్ఛాపురం బదిలీ చేస్తున్నట్లు ఆ రోజే రిలీవ్ చేసినట్లు ఆర్డర్స్ ఇచ్చారు. వాటి మీద స్వయానా అతని బావగారైన ఆఫీసర్ గారే సంతకం పెట్టారు.

మురళి "సి. గు." దగ్గరకు వచ్చి - "ఏమిటిది?" అన్నాడు.

"తెలియడం లా - మీకు ట్రాన్స్ఫర్ ఆర్డర్స్."

"మా బావగారే సంతకం పెట్టారా?"

"అవును."

"ఎందుకు ట్రాన్స్ఫర్ చేశారు నన్ను?" మంత్రివర్గం నుంచి డిస్మిస్ అయిన మంత్రిలా దీనంగా అడిగాడు.

"ఏమో పై నుంచి టెలిగ్రాఫిక్ ఆర్డర్స్ వచ్చాయి - మిమ్మల్ని బదిలీ చెయ్యమని."

"అలాగా" అంటూ - వెళ్ళిపోయాడు మురళి.

** ** ** **

ఆఫీసరు గారి ఇంటి దగ్గర...

"అక్కా చూశావా? బావగారెంత పని చేశారో? నన్ను ఇచ్ఛాపురం బదిలీ చేశారు."

"నిజమేనటరా?" ఆవిడ ఆందోళనగా అంది.

"నువ్వు ఈ బదిలీ ఆపుచేయకపోతే నేను ఆఫీసులో తల ఎత్తుకుని తిరగలేను. ఢిల్లీకి ట్రంక్‌కాల్ చెయ్యక్కా" అన్నాడు.

ట్రంక్‌కాల్ చేశారు.

"హలో మీరేనా?... మా తమ్ముణ్ణి ఇచ్ఛాపురం ట్రాన్స్ఫర్ చేశారా? ఎందుకు

"ఏమిటి నువ్వు మాట్లాడేది

"-" మళ్ళీ చెప్పిందామె.

"ఎందుకని?"

"పై నుంచి టెలిగ్రామ్ వచ్చిందనీ, మీరే చెప్పారనీ "సి. గు." చెప్పారట"

"అలాగా? వెళ్ళి చేరమను."

"మీరున్నారనే ధైర్యంతో నాకు తోడుగా ఉంటాడని తీసుకు వచ్చాను. భలే నిర్వాకం చేశారు."

"నేను వచ్చాక చూద్దాంలే. చేరమను వెళ్ళి" అన్నాడు. ఆయనకు ఆ కాగితం చూసిన గుర్తు లేదు. అయినా భార్య ముందు పరువు పోకుండా సంబాళించుకున్నాడు.

** ** ** **

రైలు స్టేషన్‌లో "సి. గు." అటూ, ఇటూ తిరుగుతున్నారు.

మురళి ఎదురయ్యాడు. ఇచ్ఛాపురం వెళుతున్నాడు. అతన్ని చూసి - "సి. గు." - "అయితే ఇచ్ఛాపురం వెళుతున్నారా? ఏ రాజమండ్రికో బదిలీ చెయ్యక ఇచ్ఛాపురం బదిలీ చేశారేమిటండీ? ... మీ బావగారు ఇలా చేశారేమిటి?" అన్నాడు.

రాజకీయంలో తన ప్రత్యర్థి చనిపోతే మనస్సులో తనకెవరూ పోటీ లేరని సంతోషపడుతూ పైకి భోరున ఏడుస్తూ - సంతాపం వెలిబుస్తున్న రాజకీయ నాయకుడిలా.

"ప్రస్తుతానికి చేరుతున్నాను. మా బావగారు వచ్చాక మళ్ళీ కాకినాడ వస్తాను" అన్నాడు - అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థి - కౌన్సిల్ ఎన్నికలు లేవా? ... జిల్లా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక లేదా అన్నట్లుగా.

"అంతేలెండి. ముందు ఆర్డర్స్ ప్రకారం చేరడం మంచిది."

మురళి తనను ఇచ్ఛాపురం బదిలీ చేయిస్తానన్నందుకు - అతన్నే ఇచ్ఛాపురం బదిలీ చేస్తూ - రిలీవ్ చేస్తూ ఆర్డర్స్, మామూలు కాగితాల్లో పెట్టి - అతని బావగారి చేతనే సంతకం పెట్టించిన "సి. గు." మురళికి "బై" చెప్పాడు. సంతోషంతో పాత తేదీతో ఒక టెలిగ్రామ్ పుట్టించాలి పై ఆఫీసు నుంచి ఈ నెలలోగా అనుకుంటున్నాడు - "సి. గు." ★

